క్లుప్తంగా

నేటితో పేరంటాలమ్మ ఉత్సవాలు ముగింపు

ఉండి: మండలంలోని వెలివర్రులో ఉన్న వీర పేరంటాలమ్మ అమ్మవారి 70వ వార్షిక మహోత్సవాలు 31వ తేదీ శుక్రవారంతో ముగియనున్నట్లు ఆలయ చైర్మన్ మంతెన రంగరాజు తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పెన్మత్స అంజనీదేవి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ముదునూరి కొండరాజు, ఆలయ మాజీ చైర్మన్ కళ్ళేపల్లి సతీష్‌రాజు తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు ఆలయం వద్ద స్థానిక మహిళలతో నిర్వహించే లలితాసహస్ర నామపారాయణ కార్యక్రమంతో చివరి రోజు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు.

చెన్నకేశవ స్వామి ఆలయ ప్రధానార్చకుడి మృతి

ఉండి: మండలంలోని ఉప్పులూరులో ఉన్న ప్రసిద్ధ చెన్నకేశవస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు వీవీ రామానుజదాసు(83) బుధవారం మృతి చెందారు. ఆయనకు భార్య,కుమార్తె ఉన్నారు. గురువారం గ్రామంలోని గ్రామ పెద్దలు, అర్చకుల సమక్షంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతిపై ఆలయ చైర్మన్ యర్రా సుబ్బారావు, గ్రామ ప్రముఖులు సంతాపం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉండి: మండలంలోని కోలమూరు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త లైన్ల ఏర్పాటు, మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని భీమవరం డీఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కోలమూరు, పాములపర్రు, కలిగొట్ల, ఆరేడు, పాందువ్వ ప్రాంతాల్లోని ప్రజలు సహకరించాలని కోరారు.

మార్టేరులో చలివేంద్రం ప్రారంభం



మార్టేరు సెంటర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ద్వారంపూడి వేణుగోపాలరెడ్డి

పెనుమంట్ర: మార్టేరు పంచగ్రామ రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో మార్టేరు సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం పశ్చిమ గోదావరి జిల్లా రెడ్డి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ద్వారంపూడి వేణుగోపాల రెడ్డి ప్రారంభించారు. వేసవిలో మార్టేరు సెంటర్‌లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు స్థానిక దాతల సహకారంతో మే నెలాఖరు వరకు ఈ చలివేంద్రాన్ని నిర్వహించనున్నట్లు సేవా సంఘం అధ్యక్షుడు కోనాల కోదండ రామ చంద్రశేఖరరెడ్డి (ఆచారి) తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, వెలగలేరు సొసైటీ అధ్యక్షుడు అల్లం భాస్కరరెడ్డి, వెలగల సోమిరెడ్డి, మల్లీడి మీరారెడ్డి, కాయల సత్యనారాయణరెడ్డి, చింతా ధర్మారెడ్డి, పొండ్రీ శ్రీను, ఎస్.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలపై అవగాహన

నరసాపురం రూరల్: ఆరోగ్యకరమైన సమాజం కోసం చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం మంచిదని ఐసీడీఎస్ సూపర్ వైజర్ హసీనా, మహిళాపోలీస్ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. ఐసీడీఎస్ ప్రాజక్టు ఆధ్వర్యంలో నరసాపురం మండలం రుస్తుంబాద గ్రామ పరిధిలోని మంగళగుంటపాలెం ప్రాథమిక పాఠశాలవద్ద గురువారం పోషణ అభయాన్ కార్యక్రమంలో భాగంగా పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బేబి నిర్మల పాల్గొని పోషక విలువలు కలిగిన రాగులు, సజ్జలు, అరికలు, సామలు, తదితర వాటిని గురించి వివరించారు. గర్భిణులు, చిన్నారులు, యుక్త వయస్సు పిల్లలకు చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు.

కోలాటం గురువుకు సత్కారం

పాలకొల్లు అర్బన్: సంస్కృతి, సంప్రదాయాలను కళారూపాల ద్వారా ప్రజలకు తెలియజేస్తూ భావి తరాలకు పునాదులు వేస్తున్న కోలాటం గురువు చిన్నా అభినందనీయులని ఆధ్యాత్మిక గురువు, సొసైటీ అధ్యక్షుడు ర్యాలి శివరామకృష్ణ ప్రసాద్ (సిద్ధాంతి) అన్నారు. స్పందన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శెట్టిబలిజ రామాలయం వద్ద నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా తిరుమల తిరుమతి దేవస్థానం ప్రోత్సాహంతో పాలకోడేరు గ్రామానికి చెందిన హరే శ్రీనివాస కోలాటం గ్రూపు వారితో కోలాటం నిర్వహించారు. స్థానిక పెద్దల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ దిడ్ల మణివజ్రం, స్పందన వాకర్ల క్లబ్ అధ్యక్షురాలు ర్యాలీ శుభ, సభ్యులు సన్నిధిరాజు సుసారిక, మంచిగంటి వరలక్ష్మి, నక్కా సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం కడు రమణీయం

- వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- భక్తులకు పానకాలు అందించిన నిర్వాహకులు



శ్రీదాసాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



మాదివాడ కోదండ రామాలయంలో పట్టువస్త్రాలను సమర్పిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీరామనవమి వేడుకలు పట్టణంలోని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఆయా వార్డుల్లోని రామాలయాల్లో, ప్రధాన ఆలయాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అలాగే ఆలయాల వద్ద కల్యాణాలు నిర్వహించిన ప్రాంతాల్లో భక్తులకు అఖండ అన్నసమారాధన నిర్వహించారు. మారుతీ టాకీస్ సెంటర్లో ఉన్న దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పాల్గొన్నారు. ముందుగా ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆకివీడులో..

ఆకివీడు: శ్రీరామ నవమి సందర్భంగా గురువారం పలు గ్రామాల్లోని రామాలయాల వద్ద సీతారాములోరి కల్యాణం కమనీయం నిర్వహించారు. స్థానిక మాదివాడలోని కోదండ రామాలయం వద్ద రాములోరికి పట్టు వస్త్రాల్ని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు కల్యాణ్యాన్ని పూర్తిగా తిలకించేందుకు, ఎండ వేడిమిని తట్టుకునేందుకు భక్తులకు ఆనవాయితీ ప్రకారం తాటాకు విసినకర్రలు పంపిణీ చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కేశిరెడ్డి మురళీ, పుప్పాల పండు, నిమ్మల నాగు, మోటుపల్లి కుమారి, మోటుపల్లి ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే సిద్ధాపురంలోని కోదండ రామాలయంలో కంచి కామకోటి పీఠాధిపతులు పంపిన ముత్యాల తలంబ్రాలతోనూ, గ్రామ పెద్ద భూపతిరాజు తిమ్మరాజు కుటుంబం అందజేసిన మంచి ముత్యాలతో సీతారాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెదకాపవరం, గుమ్ములూరు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రామాలయం వద్ద కల్యాణం కనుల విందుగా జరిగింది. పెదకాపవరంలోని ఆలయ కమిటీ చైర్మన్ కఠారి కేశవరావు, రాము, పిచ్చయ్య తదితరుల ఆధ్వర్యంలో నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. స్థానిక ఎస్.టర్నింగ్ వద్ద, కూరగాయల మార్కెట్ వద్ద, వెలంపేట, తీగలదొడ్డిలోని కల్యాణ రామాలయం వద్ద, చెరుకుమిల్లి, కుప్పనపూడి, దుంపగడప తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు.

కాళ్లలో..

కాళ్ల: శ్రీరామనవమి సందర్భంగా గురువారం కలవపూడి, కాళ్ల, పెదఅమిరం గ్రామాల్లోని రామలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళ్లకూరు, దొడ్డనపూడి, కోమటి గుంట గ్రామంలోపెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సీసలిలో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో సామూహిక సీతారామ కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. ట్రస్ట్ బోర్డు చైర్ పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతి దేవి కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు ముత్యాల తలంబ్రాలను ప్రసాదంగా అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కాళ్ల, బొండాడ, కోపల్లె, జువ్వలపాలెం, ఏలూరుపాడు తదితర గ్రామాల్లో రామాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

ఉండిలో..

ఉండి: శ్రీరామనవమి సందర్భంగా గురువారం ఉదయం నుంచి మండలంలోని అన్ని రామాలయాలు, అభయాంజనేయస్వామి ఆలయాల వద్ద నవమి వేడుకలను నిర్వాహకులు కన్నుల పండుగలా నిర్వహించారు. వడపప్పు,పానకం భక్తులు పంచిపెట్టారు. సీతారాములకు ప్రత్యేకమైన పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: శ్రీరామనవమి సందర్భంగా గురువారం మండలంలోని గ్రామాల్లో వీధివీధినా సీతారాముల కల్యాణాలు వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రమైన పాలకోడేరులోని సోము వారి కల్యాణ మండపం వద్ద ఉన్న కోదండ రామాలయంలో సోము ప్రసాద్ ఆధ్వర్యంలో సోము కాశీ విశ్వేశ్వర రావు-రంగ కుమారి దంపతులు, శృంగ వృక్షం లోని శివాలయం వద్ద ఉన్న రామాలయంలో కూర్మాల రాజా- జయసుధ దంపతులు, వడ్డీల వీధిలోని రామాలయంలో రాజా గిరిధర్-శిరీష దంపతులు సీతారాముల కల్యాణం నిర్వహించారు. పెన్నాడ, గొరగనమూడి, విస్సాకోడేరు, గరగపర్రు, గొల్లలకోడేరు, కొండేపూడి, కోరుకొల్లు, మోగల్లు గ్రామాల్లోనూ పలు దేవాలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు.



ఉండిలో ప్రత్యేకాలంకరణలో స్వామి వారు



పెదఅమిరంలోని రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న దంపతులు

వీరవాసరంలో..

వీరవాసరం: శ్రీరామనవమి సందర్భంగా గురువారం మండలంలోని అన్ని రామాలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వీరవాసరంతో పాటు రాయకుదురు, తోలేరు, కొణితివాడ, మత్స్యపురి, నందమూరి గరువు, అండలూరు, మడుగు పోలవరం, పంజా వేమవరం, చింతల కోటి గరువు, బొబ్బనపల్లి తదితర గ్రామాల్లో శ్రీ కోదండ రామాలయాల వద్ద శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవాలు అద్భుతంగా నిర్వహించారు. ఆలయాల వద్ద అన్న సమారాధన నిర్వహించి, అనంతరం స్వామి వారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో గూడూరి ఓంకారం దంపతులు, చల్లబోయిన బాలకృష్ణ దంపతులు, నూకల శ్రీనివాస్ దంపతులు, దేవి రెడ్డి వెంకటేశ్వరరావు దంపతులు, గడ్డం భారతి భాస్కరరావు, గుడాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పాలకోడేరులో శ్రీసీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



రాయకుదురులో శ్రీసీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



కన్వీనర్లకు కిట్‌లు పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

జగనన్న నీవే మా నమ్మకం, భవిష్యత్...

కాళ్ల: రాష్ట్ర ప్రజలకు జగనన్నే నమ్మకమని ఆయన అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ కన్వీనర్లకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. పెద అమీరం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సచివాలయ కన్వీనర్లతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లతో కలిపి గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి, అభివృద్ధి గురించి తెలియజేయాలన్నారు. ప్రతి మహిళకు సీఎం జగన్ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారనే విషయాన్ని ప్రతి మహిళకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరు కష్టపడి రానున్న ఎన్నికల్లో జగనన్న నమ్మకాన్ని నిలబెట్టాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ నుంచి వచ్చిన కిట్లను కన్వీనర్లకు పీవీఎల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో ఉండి మండల కన్వీనర్ పెనుమత్స ఆంజనేయరాజు, కోపల్లె కల్వపూడి సొసైటీల అధ్యక్షుడు వేగేశ్న జయరామ కృష్ణంరాజు, పెనుమత్స ప్రసాదరాజు, సాగిరాజు హరి వర్మ, వీరమల్లు గంగయ్య, పుప్పల పండు తదితరులు పాల్గొన్నారు.

కొట్టి గాయపరిచారని వ్యక్తి ఫిర్యాదు

సాక్షి, భీమవరం: మండలంలోని బలుసుమూడిలోని ఒక అపార్ట్‌మెంట్ ఆవరణలో మోటార్ సైకిల్ పార్కింగ్ చేస్తుండగా అదే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఇద్దరు కొట్టి గాయపరిచారని బి.ఉదయ్ కిరణ్ ఫిర్యాదు చేశారని ఎస్సై వి.రాంబాబు తెలిపారు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

పాలకోడేరు: మండలంలోని గరగపర్రులో కోడిపందాల స్థావరంపై ఎస్సై ఎన్.శ్రీనివాసరావు గురువారం సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఒక కోడి ఒక కోడి కత్తి రూ.1500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

కళాకారులను ప్రోత్సహించాలి

కాళ్ల: నాటకరంగ కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కళాకారులను ప్రోత్సహించడంలో మాజీ ఎంపీపీ కందుల వెంకట మల్లికార్జునరావు ముందుంటారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ గోకరాజు రామరాజు అన్నారు. కాళ్ల మండలం బొండాడ గ్రామంలో కందుల లక్ష్మణ స్వామి, తులసమ్మ దంపతులతో ప్రతిష్ఠించిన భద్రాద్రి శ్రీరామచంద్ర స్వామి 30వ వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జరిగిన ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ఉభయ రాష్ట్రాల్లో నాటక రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన ప్రముఖ పౌరాణిక నాటకరంగ కళాకారిణి జి.రత్నశ్రీ, సత్తిబాబు దంపతులను సుమారు రూ.1లక్ష 65 వేల విలువైన సువర్ణకంకణంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్కారం అందుకున్న నాటకరంగ కళాకారిణి రత్నశ్రీ మాట్లాడుతూ కళాకారులను సత్కరించిన మల్లికార్జునరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంటీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, పాతపాటి శ్రీనివాసరాజు, గాదిరాజు సుబ్బరాజు, సర్పంచ్ లఛాంబర్ జిల్లా అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, జడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఉండి ఏఎంసి మాజీ చైర్మన్ మన్నె నాగరాజు, మన్నె శ్రీనివాస్, పలు గ్రామాల సర్పంచ్‌లు కూచంపూడి లక్ష్మిపతి రాజు, తానంకి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బొండాడలో రత్నశ్రీ, సత్తిబాబు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

స్వామివార్లకు వెండి కిరీటాల సమర్పణ

భీమవరం అర్బన్: మండలంలోని పెదగరువు గ్రామంలో ఉన్న శ్రీ కోదండరామాలయంలో శ్రీరామనవమి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు, సత్యనారాయణమ్మ, చేకూరి సూర్యనారాయణరాజులు సుమారు రెండు కేజీల విలువైన వెండి కిరీటాలను స్వామివార్లకు సమర్పించారు. ఈ కిరీటాలను అలంకరించిన అనంతరం తోటకూర సుబ్బరాజు, సువర్చల దంపతుల చేతుల మీదుగా కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గొల్లవానితిప్ప గ్రామంలో శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో శ్రీరామన నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుద్దటి దత్తాత్రేయ, లక్ష్మి కరుణ దంపతులు కలశపూజ, గౌరి, విఘ్నేశ్వర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.



పెదగరువులో స్వామి వార్లకు వెండి కిరీటాలు సమర్పిస్తున్న ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు

వడ్డీ రాయితీతో పన్ను వసూళ్ల జోరు

- భీమవరం మున్సిపాలిటీ లో 80 శాతం మేర పన్ను వసూళ్లు
- ఇప్పటివరకు 18.2 కోట్లు వసూళ్లు
- నేటితో ముగియనున్న రాయితీ గడువు

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిదారులకు వడ్డీ రాయితీ ఇవ్వడంతో పన్నుల చెల్లింపు జోరుగా సాగుతున్నాయి. శుక్రవారం వడ్డీ రాయితీ అవకాశం ఉండడంతో పన్ను చెల్లింపు బకాయిదారులు వడ్డీ రాయితీ చక్కగా ఉపయోగించుకుని పన్ను చెల్లిస్తున్నారు. అందులో భాగంగా భీమవరం మున్సిపాలిటీ ఇప్పటివరకు సుమారు 80 శాతం మేర పన్ను వసూళ్లు చేసి రికార్డు సృష్టించింది. మొత్తం రూ.21.35 కోట్లు డిమాండ్ కాగా ఇప్పటివరకు రూ.18.2 కోట్లు వసూలయ్యాయి. ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇవ్వడం వల్ల మొత్తం డిమాండ్ పన్నుకు సంబంధించి సుమారు రూ.4 కోట్లు మేర ఆదాయం కోల్పోయినప్పటికి పన్ను బకాయిదారులకు మేలు చేసినట్లు అయ్యింది. వడ్డీ రాయితీ ఉండడంతో ఏళ్ల తరబడి ఉన్న పన్ను బకాయిలు వసూలు అవుతున్నాయి.

రూ.5 వేలు నుంచి రూ.4 లక్షల వరకూ

ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇవ్వడంతో భీమవరం పట్టణంలో పన్ను బకాయిదారులకు రూ.5 వేలు నుంచి రూ.4 లక్షల వరకు ఆయా ఆస్తుల బట్టి ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. పట్టణంలో ఉన్న ఓ విద్యాసంస్థకు, ఓ కార్లు షోరుమ్ వారికి వడ్డీ రాయితీ వల్ల లక్షల్లో ఆర్థిక ప్రయోజనం కలిగింది.



భీమవరం మున్సిపాలిటీలో పన్నులు కడుతున్న ప్రజలు

వడ్డీ రాయితీని ఉపయోగించుకోవాలి



ప్రభుత్వం వడ్డీ రాయితీ కల్పించడంతో ఆస్తి పన్ను బకాయిదారులు చక్కగా అవకాశాన్ని ఉపయోగించుకుని పన్ను చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు రూ.18.2 కోట్లు వసూలు చేశాం. శుక్రవారం వరకూ మాత్రమే గడువు ఉంది కాబట్టి పన్ను చెల్లించాల్సిన వారు వడ్డీ రాయితీ ఉపయోగించుకుని పన్ను చెల్లించాలి.

– ఎస్.శివరామకృష్ణ, మున్సిపల్ కమిషనర్, భీమవరం

పంట కాలువలో మృతదేహం లభ్యం

ఉండి: మండలంలోని కలిసిపూడి పంటకాలువలో గురువారం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు ఓ యువకుడి మృతదేహాన్ని పంటకాలువ నుంచి వెలికితీసి భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 16 ఏళ్లు ఉండవచ్చునని సమాచారం. అయితే మృతదేహం వివరాలు గాని ప్రమాదమా? లేక ఇతర కారణాలతో మృతి చెందాడా? అనే విషయాలు తెలియరాలేదని పోలీసులు చెబుతున్నారు. అయితే దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని దీనిపై తాము కేసు నమోదు చేయలేదని పోలీసులు చెబుతున్నారు.

ముత్యాలమ్మకు వెండి సమర్పణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబపురం ముత్యాలమ్మ వారి వెండి చీర నిమిత్తం తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన గొర్లి సూర్యానారాయణ – అప్పాయమ్మ దంపతులు అర కిలో వెండిని గురువారం ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా దాతల పేరిట అమ్మవారికి పూజలు జరిపించారు.

రేపు పెన్నాడలో ఈఓపీఆర్‌డీ విచారణ

పాలకోడేరు: అంధుడైన తనను భార్య బలవంతంగా బెదిరించి ఇంటి నుంచి గెంటివేసిందని, ఆపై తన ఇంటి పన్నును తన పేరు పై మార్చి వేసుకుందని ఇందుకు అధికారులు సహకరించారని, పెన్నాడ గ్రామానికి చెందిన చీరా వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ఉదయం 11 గంటలకు సచివాలయం 1 వద్ద విచారణ నిర్వహిస్తామని పాలకోడేరు మండల ఈఓపీఆర్‌డీ రెడ్డయ్య గురువారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు బాధితుడు కేంద్ర న్యాయ శాఖ మంత్రికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా పంచాయతీ అధికారి స్పందించి, విచారణ చేసేందుకు తనను నియమించారని రెడ్డయ్య తెలిపారు. సదరు సమాచారాన్ని బాధితుడికి, భార్యకు, ప్రస్తుత పంచాయతీ కార్యదర్శికి, బదిలీ అయిన కార్యదర్శికి తెలియజేశామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉండి: ఉండి సెంటర్ సమీపాన గణపవరం రోడ్డు కార్నర్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. ఉండి సెంటర్ నుంచి గణపవరం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని మినీ వ్యాన్ ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో బాధితులను చికిత్స నిమిత్తం భీమవరం ఆస్పత్రికి తరలించారు. అయితే ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న వెంటనే మినీ వ్యాన్ డ్రైవర్ వ్యాన్‌ను విడిచి పెట్టి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఈ ప్రమాదంపై బాధితుల వివరాలపై ఇంకా సమాచారం అందాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

నేటితో ముగుస్తున్న వడ్డీ రాయితీ గడువు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిదారులు శుక్రవారం సాయంత్రం 5 గంటలు లోపుగా కడితేనే వడ్డీ రాయతీ వస్తుందని మున్సిపల్ ఆర్‌ఐ కె.నానాజీ చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి బకాయిలు చెల్లించిన వారికి ఇది వర్తిస్తుందని చెప్పారు. పన్ను బకాయిలు మీ–సేవ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు, సచివాలయాల్లో చెల్లించవచ్చని చెప్పారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు క్షీరారామలింగేశ్వర స్వామి కల్యాణం



శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు గురువారం సాయంత్రం గణపతి పూజ, అంకురార్పణ, ధజారోహణ, అగ్నిప్రతిష్టాపన, బలిహరణతో ఉత్సవాలను ప్రారంభించారు. శుక్రవారం రాత్రి 5.15 గంటలకు (తెల్లవారితే శనివారం) శ్రీ పార్వతి సమేత శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీసమేత శ్రీ జనార్దనస్వామివార్ల సప్తాహ్నిక కల్యాణం జరగనుంది. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు వివిధ సన్నాయి వాయిద్యాలతో స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణమహోత్సవాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు తెలిపారు ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

రైల్వేస్టేషన్ రోడ్డులో ద్విచక్ర వాహనాలకు అనుమతి

నరసాపురం: పట్టణంలోని 30వవార్డు రైల్వే స్టేషన్ రోడ్డులో రూ 1.40 కోట్లు నిధులతో చేపట్టిన రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీంతో ఈ మార్గంలో నిలుపుదల చేసిన వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతానికి సరిపల్లి మీదుగా వెళ్లే ద్విచక్ర వాహనాలకు అనుమతి ఇచ్చారు. ఫోర్ వీలర్స్‌కు మరో రెండు రోజుల్లో అనుమతి ఇస్తారు. రైల్వే స్టేషన్‌రోడ్డులోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం నుంచి గ్రేస్ నగర్ వరకూ వరకూ సాగుతున్న రోడ్డు పనులు కారణంగా గత 20 రోజులుగా ప్రజలు చుట్టుతిరిగి ప్రయాణించాల్సి వస్తోంది.